# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 08 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య

### 800కు పైగా విమానాల రాకపోకలకు అంతరాయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశ రాజధాని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతికలోపం తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీని కారణంగా దాదాపు 800కుపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజుకు 1500కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి."ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక సమస్య కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు ఆలస్యం అవుతున్నాయి. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు సాంకేతిక సిబ్బంది వారి భాగస్వాములతో కలిసి చురుకుగా పనిచేస్తున్నారు. దీంతో విమాన రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. తాజా అప్డేట్‌ల కోసం ప్రయాణికులు తమ విమానయాన సంస్థలతో టచ్‌లో ఉండాలి. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మేము హృదయపూర్వకంగా చింతిస్తున్నాము."అని ఢిల్లీ విమానాశ్రయం ఎక్స్ పోస్టులో పేర్కొంది.

## మరో రూ. 600 కోట్లు విడుదల

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కళాశాలల యజమాన్యాలతో చర్చలు సఫలం
- ప్రయివేటు కాలేజీల బంద్ విరమణ
- నేటినుంచి తరగతులు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వంతో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఈనెల మూడో తేదీ నుంచి తలపెట్టిన ప్రయివేటు కాలేజీల బంద్‌ను విరమించాయి. శుక్రవారం హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఫతి చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు, సెక్రెటరీ జనరల్ రవికుమార్, కోశాధికారి కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె సునీల్‌కుమార్ చర్చలు జరిపారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి రూ.1,500 కోట్లు విడుదల చేయాలంటూ ప్రభుత్వాన్ని అడిగారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఇప్పటికే రూ.600 కోట్లు విడుదల చేశామనీ, మరో రూ.600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మరో రూ.300 కోట్లు కొద్ది రోజుల్లోనే మంజూరు చేస్తామన్నారు. ఫీజు బకాయిల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందనీ, బంద్‌ను విరమింపజేయాలని కోరారు. ఫతి చైర్మెన్ రమేష్‌బాబు మాట్లాడుతూ రూ.600 కోట్లు వెంటనే విడుదల చేయడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇవ్వడంతో కాలేజీల బంద్‌ను విరమింపజేయాలని నిర్ణయించామని చెప్పారు. నిరసన కార్యక్రమలన్నీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి ఒక కమిటీని వేయాలని కోరారు. దీనిపై స్పందించిన భట్టి త్వరలోనే ఒక కమిటీని వేసి త్వరితగతిన నివేదిక వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తామనీ, ఆ కమిటీలో అధికారులతోపాటు కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తామని అన్నారు. రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యాశాఖ ఇన్‌చార్జీ కార్యదర్శి శ్రీదేవసేన లేదా ఇతర అధికారులపై తాము ఎలాంటి వ్యాఖ్యానాలు చేయలేదని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో తాము ఒకటి మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు ఆ మాటలను వక్రీకరించాయని అన్నారు. దాన్ని ఖండించామని గుర్తు చేశారు. మూడో తేదీ నుంచి కాలేజీల బంద్ వల్ల కొన్ని పరీక్షలను నిర్వహించలేకపోయామనీ, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారనీ, అందుకు చింతిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయాల అధికారులతో సంప్రదించి త్వరగా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం అయినందున అధ్యాపకుల ప్రదర్శనను రద్దు చేస్తున్నామని సెక్రెటరీ జనరల్ రవికుమార్ చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధ్యాపకుల ప్రదర్శన తప్పు అని కోర్టు చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విద్యాకార్యదర్శి శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు క్రమక్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచారు. చాలా చోట్ల పంట తడిసిపోయింది. ఈ నేపథ్యంలో వడ్ల కొనుగోళ్లు కొంత ఆలస్యమైనా...నాలుగైదు రోజుల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,226 కేంద్రాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మరో వెయ్యికిపైగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పౌరసరఫరాల శాఖ సమాయత్తమవుతున్నది. ఇప్పటివరకు 76,145 మంది రైతుల నుంచి 5.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. వీటి విలువ రూ.1400 కోట్లు ఉందని అధికారులు చెబుతున్నారు. నవంబర్ చివరివారం వరకు సుమారుగా 20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవచ్చని పౌరసరఫరాల శాఖ అంచనా వేస్తోంది. క్వింటాళ్లకు గ్రేడ్ రూ.2,389, సాధారణ రకం ధాన్యం రూ. 2,369 కొనుగోలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ రూ.500 ఇస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు వడ్లను వేర్వేరుగా సిబ్బంది తూకం వేస్తున్నారు. అక్టోబర్ మొదటి వారంలో నిజామాబాద్‌లో మొదటి కేంద్రం ప్రారంభమైంది. ఈ వారంలో కొమురంభీం ఆసిఫాబాద్, హన్మకొండ, ఖమ్మం, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలో చివరిగా ప్రారంభించింది. అక్టోబర్‌లో 6.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. కానీ వర్షాల కారణంగా అనుకున్న టార్గెట్ చేరుకోలేక పోయింది. నవంబర్‌లో 32.95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ఆ దిశగా సేకరణ చేపట్టేందుకు జిల్లాల అధికారులు వేగవంతం చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు పట్టాదారు ఐరిష్ పెట్టాలనే నిబంధన కౌలు రైతులకు ఇబ్బందికరంగా మారింది. కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టా పాస్‌బుక్ కలిగిన రైతులు వస్తేనే కాంటా వేస్తామంటూ అధికారులు చెబుతున్నారు. నగదు కూడా వారి ఖాతాలోనే జమ చేస్తామని అంటున్నారు. ఈ నిబంధనలతో పట్టా బుక్‌లేని కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వరిసాగు చేయని రైతుల వద్దకు వెళ్లి వారి పేర్ల మీద అమ్మకాలు చేసే దుస్థితి ఏర్పడింది. మెదక్, సిరిసిల్ల జిల్లాలో కొత్త నిబంధనలు పెట్టి కచ్చితంగా రైతుల ఐరిష్ పరీక్షలు పూర్తయితే కొనుగోళ్లు చేపడుతున్నట్టు తెలిసింది. మధ్య దళారులు ధాన్యం అమ్ముకుంటే మాత్రం ఎలాంటి నిబంధన వర్తించదు. కానీ రైతులు, కౌలు రైతులు మాత్రం ఎన్నో షరతుల మధ్య ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రైతులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు అన్నదాతలు చెబుతున్నారు. ఆశించిన స్థాయిలో ధాన్యం రావడం లేదన్న కారణంగా అధికారులు గన్నీ బ్యాగులను సరఫరా చేయడం లేదని తెలిసింది. గతేడాది వానాకాలం సీజన్ కంటే ఈసారి వరి ధాన్యం ఉత్పత్తి పెరగనున్న నేపథ్యంలో 10.42 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. వడ్లలో 17 శాతం తేమ ఉన్న రైతులకే బస్తాలు పంపిణీ చేస్తున్నారు.

రైతులు తమ ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవద్దంటూ ఊరురా ప్రచారం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వారం రోజుల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేస్తామని చెబుతున్నారు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం గుట్టు చప్పుడుగా దిగుమతి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు రైతులను కోరుతున్నారు. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, చెక్‌పోస్టులు, పోలీసు పహరా కాస్తున్నారు.

## దమ్ముంటే పాలన చూపించి ఓట్లు అడగాలి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఓటమి అంగీకరించాడు
- తేందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తన పాలనకు రెఫరెండం కాదన్నాడు
- కాంగ్రెస్ ను ఓడగొడితేనే ఆరు గ్యారెంటీలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పుకోరాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తాను చేసింది ఏమీ లేకపోవడంతోనే రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పోలింగ్ కంటే ముందే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని అందుకే జూబ్లీహిల్స్ అనేక తన ప్రభుత్వానికి పరిపాలనకు తనకు రెఫరెండం కాదు అని చెప్పారని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి తన పరిపాలన పైన నమ్మకం లేకనే ప్రజల్లో నెలకొన్న తీవ్రమైన వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం కాదు అని చెప్పారని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఈరోజు చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అన్నమాట స్పష్టమైనది అన్నారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ లో రోడ్డు షో నిర్వహించిన కేటీఆర్ రేవంత్ రెడ్డి ఈరోజు మీడియా సమావేశంలో చేసిన అనేక వ్యాఖ్యల పైన గట్టిగా కౌంటర్ ఇచ్చారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 24 నెలల కాలంలో చేసింది ఏమీ చెప్పుకోవడానికి లేకపోవడంతోనే పాత కాలం కథలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పాలన కాలంలో చేసిన అభివృద్ధిని చూపించి సంక్షేమ పథకాల అమలు చూపించి ఓట్లు అడగాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు అని సబ్బండ వర్గాలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశారన్నారు. రెండు సంవత్సరాల పరిపాలనలో మోసం చేసిన విద్యార్థులు యువకులు రైతన్నలు పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాన్ని చూసినందుకు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కాలంలో హైదరాబాదు నగరాన్ని అధఃపాతాళానికి తీసుకువెళ్లినందుకు నగర ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాల పైన కేటీఆర్ మండి పడ్డారు గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

10 సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మేము అడిగితే రేవంత్ రెడ్డి తనకు సంబంధంలేని గత ప్రభుత్వపు కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడం పైన కేటీఆర్ ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాల కాలంలో ఐటీ పరిశ్రమ నుంచి మొదలుకొని టిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణము ప్రజారోగ్యం, రోడ్లు, ఫ్లై ఓవర్లు, లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, 47 ఫ్లై ఓవర్లు రోడ్ల నిర్మాణం, రాష్ట్రాన్ని ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం వంటి అన్ని రంగాల్లోనూ

మిగితా 4వ పేజీలో

# పరిపాలనను పోల్చి ఓటేయ్యాలి

- ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ వల్ల తెలంగాణకు ఒరిగిందేమీ లేదు
- కాళేశ్వరంపై కేంద్రం ఎందుకు ముందుకు కదలటం లేదు?
- ప్రతీ ఎన్నికా తమ పనితీరుకు పరీక్షే
- మెట్రో రైల్ నష్టాలకు, ఆ ప్రాజెక్టు నుంచి ఎల్అండ్‌టీ తప్పుకోవటానికి బీఆర్ఎస్ సర్కారు లోప భూయిష్టమైన విధానాలే కారణం
- వరదలొచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం ఒక్క పైసా ఇవ్వలే
- కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదు
- నూతన సచివాలయం వల్ల ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇద్దరూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరూ హైదరాబాద్ నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ వల్ల తెలంగాణకు ఒరిగిందేమీ లేదనీ, వారి వల్ల రాష్ట్రానికి ఒక్క పైసా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ పాలనతో తమ కాంగ్రెస్ పరిపాలనను సరిపోల్చి చూసుకుని ఓటేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ఆయన పిలుపు నిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజహరుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి సీఎం రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు.

బీఆర్ఎస్, బీజేపీలది ఫెవికాల్ బంధమంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చించి, సీబీఐ విచారణకు తమ ప్రభుత్వం ఆదేశించినా, కేంద్రం ఎందుకు ముందుకు కదలటం లేదని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కేటీఆర్‌కు పూర్తిగా లొంగిపోయారంటూ విమర్శించారు. గుజరాత్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లో నదుల ప్రక్షాళన, సుందరీకరణను బీజేపీ చేపట్టిందనీ, అదే పార్టీ నేతలు రాష్ట్రంలో మాత్రం మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ, ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని సీఎం తెలిపారు. ఆ తర్వాత పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాలూ నాశనమయ్యాయని చెప్పారు. ఔటర్ రింగు రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మెట్రో రైల్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవి కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణను కేసీఆర్ చేతిలో పెడితే, పదేండ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులను మిగిల్చి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు యూపీఏ హయాంలో రాష్ట్రానికి కేటాయించిన ఐటీఐఆర్‌ను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. వరదలొచ్చి హైదరాబాద్ మొత్తం మునిగిపోతే కేంద్రం మనకు ఒక్క పైసా ఇవ్వలేదని వాపోయారు.

హైదరాబాద్ మెట్రో రైల్ నష్టాలకు, ఆ ప్రాజెక్టు నుంచి ఎల్అండ్‌టీ తప్పుకోవటానికి బీఆర్ఎస్ సర్కారు లోప భూయిష్టమైన విధానాలే కారణమని సీఎం తూర్పారబట్టారు. తమ హయాంలో కాళేశ్వరం, నూతన సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతి భవన్‌ను నిర్మించామంటూ బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెపుకుంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదనీ, నూతన సచివాలయం వల్ల ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదని చెప్పారు. ప్రతిపక్షాలపై నిఘా కోసమే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించారని, బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు, తలుపులతో నిర్మితమైన ప్రగతి భవన్‌లోకి సామాన్యులెవర్నీ రానివ్వలేదని విమర్శించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలనే అత్యాశతో వాస్తు సరిగా లేదనే కారణంతో ఎన్నో ఏండ్లు పటిష్టంగా ఉండే పాత సచివాలయాన్ని కేసీఆర్ కూల్చివేశారని తెలిపారు. కేటీఆర్ వల్లే హైదరాబాద్‌కు గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వచ్చి పడ్డాయని విమర్శించారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందనీ, ఈ క్రమంలో 'తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047'ను తమ ప్రభుత్వం రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఆ డాక్యుమెంట్ అమలుకు అందరూ సహకరించాలని కోరారు. 30 ఏండ్ల పాటు పెండింగ్‌లో ఉన్న శామీర్‌పేట, మేడ్చల్ ఎలివేటెడ్ కారిడార్‌కు తమ ప్రభుత్వ హయాంలో అప్రూవల్ తెచ్చామని చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. అద నంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేదాకా కళాశాలలను తెరవబోమంటూ చెప్పిన ప్రయివేటు, కార్పొరేట్ ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాలపై సీఎం ఈ సందర్భంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారి ట్రాప్‌లో ఎంపీ ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ మాదిగ పడ్డారని విమర్శించారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయనీ, ఎక్కడపడితే అక్కడ పర్మిషన్లు ఇవ్వాలంటూ కోరుతున్నాయని వివరించారు.

మిగితా 4వ పేజీలో

## ఎక్కడ అడ్డుకున్నానో చెప్పాలి

- కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బ్యాడ్ ఫ్యామిలీస్. ఈ రెండు కుటుంబాలు తెలంగాణకు పట్టిన శని" అని తీవ్ర విమర్శలు గుప్పించారు. "రేవంత్ రెడ్డి చెబుతున్నట్లు నేను మెట్రో విస్తరణను అడ్డుకున్నానంటున్నారు. ఎక్కడ అడ్డుకున్నానో ఒక్క ఉదాహరణ చెప్పాలి. ఎల్ అండ్ టీతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఒప్పందం కూడా చేసుకోలేదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేయకపోవడం వారి వైఫల్యం," అని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. "ఆర్‌ఆర్‌ఆర్‌ను మోడీ చేతుల మీదుగా నేనే మంజూరు చేయించాను" "రేవంత్ రెడ్డి సీఎం అయ్యే ముందు నేనే ప్రధాని నరేంద్ర మోడీని కలసి రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) మంజూరు చేయించాను. ఇప్పుడేమో తానే దానికి క్రెడిట్ తీసుకోవాలని చూస్తున్నారు," అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను తానే అడ్డుకున్నానని ఆరోపించడం నిరాధారమని, "సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం తగదు" అని ఆయన విమర్శించారు. ఎంఐఎం కాలేజీలను ఎందుకు కూల్చలేదు? మూసీ ప్రక్షాళన అంశంపై మాట్లాడుతూ, "మూసీ బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం. మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు. నిజంగా హైడ్రా న్యాయం వైపు ఉంటే, ముందుగా ఎంఐఎం కాలేజీల అక్రమాలను ఎందుకు కూల్చలేదు?" అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. "ప్రజలకు మేలు చేసే పని చేస్తే మేము అడ్డుకోము" "కేంద్రం ఎప్పుడూ తెలంగాణ అభివృద్ధికి అడ్డంకి కాలేదు. ప్రజల ప్రయోజనాల కోసం చేసే ప్రతీ పనికి మేము అండగా ఉంటాం," అని ఆయన స్పష్టం చేశారు.

## వీధి కుక్కలపైచర్యలు తీసుకోవాలి

- బహిరంగ ప్రదేశాల నుంచి షెల్టర్లకు తరలించాలి
- స్కూల్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రుల్లోకి రాకుండా కంచెలు వేయాలి
- సుప్రీం కోర్టు

వివరాలు 4వ పేజీలో

## పథకాలు ఆపేస్తామని బెదిరించడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు పథకాలు ఆపేస్తామంటూ బెదిరించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే టీ.హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. "రేవంత్ రెడ్డి ఇంట్లో నుంచి డబ్బులు ఇస్తున్నాడా? లేక ఆయన నాయన డబ్బులు ఇస్తున్నాడా? ప్రజల సొమ్ము ప్రజలకే ఇస్తున్నారు. అది ప్రభుత్వ బాధ్యత, దయ కాదు," అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ఓటమి భయంతో ప్రజలను బెదిరిస్తున్నాడని, కాంగ్రెస్ రెండేళ్ల అరాచక పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

హరీశ్‌రావు మాట్లాడుతూ, "కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ వికాస మార్గంలో నడిచింది. కానీ రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం పూర్తిగా విధ్వంసమైంది. ఈ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ప్రజలు మరో మూడేళ్లు నరకయాతన అనుభవించాల్సి వస్తుంది" అని అన్నారు. "కంటోన్మెంట్ ఉపఎన్నిక ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదు. 6 వేల ఇందిరమ్మ ఇండ్లు, రూ.23 కోట్ల స్పోర్ట్స్ కాంప్లెక్స్, డిఫెన్స్ భూముల రెగ్యులరైజేషన్ ၊ ఇవన్నీ కేవలం ఓటు కోసం చెప్పిన వాగ్దానాలే. ఇప్పుడు ఆ ప్రాంతం నాశనమైపోయింది. రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి, వీధి దీపాలు కూడా లేవు" అని హరీశ్‌రావు విమర్శించారు.



"ముస్లింలు స్వాతంత్ర్యం కోసం పోరాడారు, కాంగ్రెస్ ఎక్కడ?""రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ၊ మేము లేకుంటే ముస్లింలకు ఇజ్జత్ ఉండదంటున్నాడు. ముస్లింలు స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేస్తున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎక్కడుంది? ఇప్పుడు వారిపై ప్రేమ చూపించడం నాటకం తప్ప మరొకటి కాదు" అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ మంత్రులు గల్లీల్లో పరిగెడుతున్నారు" "బీఆర్ఎస్ ప్రశ్నించకపోతే ఈ కాంగ్రెస్ మంత్రులు బయటకు రారని" హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. "పీజేఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా కాంగ్రెస్ ఇబ్బంది పెట్టి, ఆయన మరణానికి కారణమైంది అదే పార్టీ. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికలు దగ్గరపడటంతోనే రేవంత్ రెడ్డికి ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తుకొస్తున్నారు. మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వడం కూడా బీఆర్ఎస్ ఒత్తిడి ఫలితం" అని అన్నారు.

## 'వందేమాతరం' దేశభక్తి స్ఫూర్తి మంత్రం

- ప్రధాని మోదీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'వందేమాతరం' గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక స్ఫూర్తి మంత్రం అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన 'వందేమాతరం' 150 ఏళ్ల స్మారకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "వందేమాతరం అనేది దేశమాత ఆరాధన, సాధన. ఈ గీతం శబ్దం మనలో ఆత్మవిశ్వాసం నింపుతుంది. భవిష్యత్తుకు భరోసా ఇస్తుంది. ఒకే లయ, స్వరం, భావంతో గీతాలాపన చేయడం ఒక అద్భుత అనుభవం. వందేమాతరం స్మారకోత్సవాలు దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయి" అని మోదీ అన్నారు. వందేమాతరం మూల భావం 'భారత్' అని ఆయన స్పష్టం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఈ గేయం స్ఫూర్తిని అందించిందని, జాతీయ ఐక్యత, జాతీయతా భావాల పెంపులో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

"వందేమాతరంలోని ప్రతి పదం మన చరిత్రను స్మరింపజేస్తుంది, వర్తమానానికి విశ్వాసాన్ని, భవిష్యత్తుకు భరోసాను ఇస్తుంది. సంకల్పిస్తే సాధించలేని లక్ష్యం ఏదీ లేదు. ఈ రోజు ఒక చారిత్రక దినోత్సవం ၊ వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాల ప్రారంభం జరుగుతోంది. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాలు కోట్లాది భారతీయుల్లో కొత్త శక్తిని నింపుతాయి" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వందేమాతర గేయంలోని ఆశయాల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య యోధులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభికులతో కలిసి ప్రధాని మోదీ వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఆలపించారు. కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రధాని వందేమాతరం 150 ఏళ్ల స్మారక నాణెం మరియు పోస్టల్ స్టాంపును కూడా విడుదల చేశారు.

ప్రధాని వెల్లడించిన ప్రకారం, 2025 నవంబరు 7 వరకు దేశవ్యాప్తంగా 'వందేమాతరం' స్మారకోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లో గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించి, యువతను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయనున్నారు.



## వరంగల్ నిట్ విద్యార్థికి రూ.1.27 కోట్ల ప్యాకేజీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) మరోసారి దేశవ్యాప్తంగా తన ప్రతిష్ఠను చాటుకుంది. గత రికార్డును అధిగమిస్తూ, సంస్థ చరిత్రలోనే అత్యధికమైన రూ.1.27 కోట్ల దేశీయ జాబ్ ప్యాకేజీ ఈసారి నమోదు అయింది. ఉత్తరప్రదేశ్ నోయిడాకు చెందిన బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) విద్యార్థి నారాయణ త్యాగి, ప్రముఖ బహుళజాతి సంస్థ నుంచి రూ.1.27 కోట్ల సీటీసీతో ఆఫర్ పొందాడు. ఇది వరంగల్ నిట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక దేశీయ ఆఫర్ అని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి మొహమ్మద్ నహిల్ నష్వాన్ రూ.1 కోటి సీటీసీతో దేశీయ ఆఫర్ పొందాడు. ఈ విజయాలు సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాయని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. "మా విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అవలంబిస్తున్నారు. పరిశ్రమలతో ఉన్న బలమైన అనుబంధం, కెరీర్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కారణంగానే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయి" అని అన్నారు.

# పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కాంట్రాక్టర్ల అల్టిమేటం..

● డిసెంబర్ 1 నుండి పనులు నిలిపివేస్తామని హెచ్చరిక..



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వానికి కాంట్రాక్టర్లు, బిల్డర్లు గట్టి హెచ్చరిక జారీ చేశారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, డిసెంబర్ 1, 2025 నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ నిర్మాణ పనులను నిలిపివేస్తామని అల్టిమేటం ఇచ్చారు.బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఐఏ) తెలిపిన వివరాల ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.18 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని కాంట్రాక్టర్లు, బిల్డర్లు తమ ఆస్తులను తాకట్టు పెట్టి, అధిక వడ్డీకి రుణాలు తెచ్చి ప్రభుత్వ నిర్మాణ పనులు చేస్తున్నారని బీఐఏ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల తమ ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతింటోందని, ఈ ప్రభుత్వం తమను రోడ్డున పడేస్తుందని వారు అసహనం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించకపోతే, డిసెంబర్ 1వ తేదీ నుండి అన్ని ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేస్తామని బీఐఏ స్పష్టం చేసింది.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా..

● ఇద్దరు నిందితులు పట్టివేత..



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో ఉదయం 10:30 గంటల సమయంలో పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బోయినిపల్లి మండల ఎస్సై రమాకాంత్ తన సిబ్బందితో పట్టుకున్నారు. నిందితులు కోట పొచయ్య (27), రేఖుర్తి గ్రామం, మరియు నల్లగొండ రాకేష్ (29), బోయినిపల్లి గ్రామానికి చెందినవారు. వీరు రేషన్ కార్డు దారుల వద్ద నుండి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. పోలీసులు ఘటన స్థలంలో సుమారు 4 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం మరియు ఎక్సెల్ మోపెడ్ ను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ పిడిఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

# చేవెళ్ల బస్సు ప్రమాద క్షతగాత్రులకు అందని నష్టపరిహారం.



**బలగం టీవీ, రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడి, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంతవరకు అందలేదు. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా, నాయకులు, అధికారులు వచ్చి పరామర్శించి వెళ్లడం తప్ప, ఆర్థిక సహాయం అందజేయడంలో ఆలస్యం జరుగుతోందని క్షతగాత్రుల బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రులందరికీ ఉచిత వైద్యం అందిస్తామని, గాయపడిన వారికి రూ.2.5 లక్షల నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ హామీలు ఆచరణలో అమలు కావడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తామని చెప్పినా, ఇన్ని రోజులుగా ఆసుపత్రి బిల్లులు, ఇతర ఖర్చుల కోసం మేమే సొంత డబ్బులు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఎప్పుడు అందుతుందో తెలియడం లేదని బాధితుల బంధువులు వాపోతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికార పార్టీకి చెందిన నాయకులు, అధికారులు ఆసుపత్రులకు వచ్చి, పరామర్శల పేరుతో రెండు రోజులు హడావిడి చేసి వెళ్లిపోయారని బాధితులు చెబుతున్నారు. ఆ తరువాత తమను పట్టించుకునేవారు కరువయ్యారని, తమ ఆరోగ్య పరిస్థితి గురించి కానీ, ఆర్థిక కష్టాల గురించి కానీ ఎవరూ అడగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## మైనారిటీలతో బీఆర్ఎస్ సమావేశం..

**బలగం టీవీ, హైదరాబాద్**

ముస్లిం మైనారిటీలు బీఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సీనియర్ నాయకులు ఆశీస్ కుమార్ యాదవ్, ఆజామ్ అలీ తదితర ప్రముఖుల ఆధ్వర్యాన యూసఫ్ గూడ డివిజన్ లక్ష్మీనరసింహ నగర్‌లో మైనారిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ అభ్యర్థి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ అభ్యర్థి సునీత, ఆశీస్ కుమార్ యాదవ్, ఆజామ్ అలీ, అర్షద్ నవాబ్ తదితర ప్రముఖులు ప్రసంగించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) హయాంలో మైనారిటీల సంక్షేమానికి అమలు చేసిన పథకాలు, కార్యక్రమాల గురించి వారు ఈ సందర్భంగా వివరించారు. మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని కొనియాడిన మైనారిటీ ప్రముఖులు ఫయీమ్, కైసర్, ఆజామ్, సమీ, ఇబ్రహీం, సలీమ్, అస్లాం, ఫైజల్, సాధిక్ తదితరులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.

## 14న బంగాళాఖాతంలో అల్పపీడనం..!

**బలగం టీవీ, హైదరాబాద్**

మొంథా తుపాను సృష్టించిన బీభత్సాన్ని ప్రజలు మర్చిపోకముందే మరోసారి వాతావరణ పరిస్థితులు భారీ వర్షాలకు అనుకూలంగా మారుతున్నాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 14న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ.. మరింత బలపడే అవకా శం ఉన్నదని, 16 నాటికి వాయుగుండంగా బలపడనుందని అంచనా వేసింది. ఈ అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో 15 నుంచి తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# దూరవిద్య ఎంబీఏ పరీక్షా తేదీల ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ సెమిస్టర్ వైజ్, ఇయర్ వైజ్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ..

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గురువారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీతో యూసఫ్ గూడ, కృష్ణానగర్, వెంకటగిరి పరిసర ప్రాంతాలు పూర్తిగా గులాబీ మయం అయ్యాయి. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, తీగుళ్ల పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

యూసఫ్ గూడ బస్తీలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయం సమీపాన మొదలైన ర్యాలీ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం, చెక్ పోస్ట్, యూసఫ్ గూడ మెట్రో స్టేషన్, కృష్ణానగర్, జామా మసీద్ మహ్మదీ, వెంకటగిరి, గాయత్రి హిల్స్ రోడ్, వెంకటగిరి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంక్, సాయి నిలయం, జూబ్లీహిల్స్ క్రాస్ రోడ్స్, ఇందిరానగర్ మీదుగా గ్రీన్ బావార్చీ వరకు సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది.

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, తీగుళ్ల పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిలు కాలినడకన ర్యాలీ అగ్రభాగాన నడిచారు. మాజీ శాసనసభ్యులు, ప్రముఖ కవి, గాయకుడు రసమయి బాలకిషన్



ప్రచార రథంపై చేసిన ఆటాపాట గులాబీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ర్యాలీలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, మహిళలు, మైనారిటీలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో గులాబీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి, కాంగ్రెస్ సర్కారును నిలదీస్తూ "బుల్డోజర్ కావాలా? కారు కావాలా?", "శాంతి పాలన కావాలా? రౌడీ రాజ్యం కావాలా?", "స్కూటీల పంపిణీ ఏమైందీ?", "తులం బంగారం ఎక్కడ?", "గృహిణులకు 2,500 రూపాయల పంపిణీ ఎక్కడ" వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కొనసాగుతున్న విధ్వంసాన్ని ఓటర్లకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికులు, వ్యాపారులు, గృహిణులతో సహా అన్ని వర్గాల ప్రజల నుంచి బీఆర్ఎస్ ప్రచారానికి సానుకూల స్పందన వ్యక్తమైంది.

ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ", "జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి", "బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కారు గుర్తుకే మన ఓటు", "అమర్ హై అమర్ హై గోపన్న అమర్ హై", "గెలిపిద్దాం గెలిపిద్దాం బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను భారీ ఓట్ల మెజారిటీతో గెలిపిద్దాం" అనే నినాదాలతో యూసఫ్ గూడ, కృష్ణానగర్, వెంకటగిరి పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శుభప్రద్ పటేల్, వై.సతీష్ రెడ్డి, ఆశీస్ కుమార్ యాదవ్, లింగాల కమల్ రాజ్, లక్ష్మణ్ రావు, జీ.వీ.రామకృష్ణారావు, చల్లా హరిశంకర్, బండారు రాజ్ కుమార్ పటేల్,రాఘవేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కూతుళ్లు అక్షర నాగ్, దిసిర, సీనియర్ నాయకులు ఆజామ్ అలీ, పుస్తె శ్రీకాంత్, కూన నరేందర్ రెడ్డి, పవన్ రెడ్డి, షబ్బీర్, ఫయీమ్, గొల్ల నర్సింగ్ రావుయాదవ్, గుండ్లపల్లి శేషగిరిరావు, కోట్ల వినోద్, నవీన్, మంజుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

విద్యార్థులను శాస్త్ర విజ్ఞానం పట్ల ఆకర్షితులను చేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే క్రమంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ - 2025 సంవత్సరానకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇల్లంతకుంట మండల విద్యాధికారి .సి.హెచ్. శ్రీనివాస్ స్థానిక స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రేమలత ల చేత ఆవిష్కరించారు. ఈ పరీక్ష అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8 ,9 మరియు 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు పాఠశాల స్థాయిలో తేదీ: 7-11-2025 న నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను తేదీ: 21-11-2025న మండల స్థాయిలో జరిగే పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. మండలంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను తేదీ: 28-11-2025న జిల్లా స్థాయిలో నిర్వహించే పరీక్షకు ఎన్నుకోబడతారని అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను గాంచిన వారిని రాష్ట్రస్థాయిలో నిర్వహించే పరీక్షకు ఎన్నిక కావడం జరుగుతుందన్నారు. ఇట్టి మంచి అవకాశాన్ని అన్ని పాఠశాలల విద్యార్థులు వినియోగించుకొని చెకుముకి సైన్స్ ప్రతిభ పోటీలను విజయవంతం చేయవలసిందిగా చెకుముకి సైన్స్ టెస్ట్ మండల కన్వీనర్ వి.మహేష్ చంద్ర కో కన్వీనర్ పి. అనిల్ కుమార్ లు కోరారు

# నేడు ఆఖరి టీ20.. విజయమే లక్ష్యం




**బలగం టీవీ, హైదరాబాద్**

ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్‌ను కోల్పోయినప్పటికీ, టీ20 సిరీస్‌ను దక్కించుకోవాలన్న సంకల్పంతో యువ భారత జట్టు నేడు ఆతిథ్య జట్టుతో తలపడనుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2%-%1 ఆధిక్యంలో ఉన్న సూర్యకుమార్ సేన, శనివారం జరగబోయే బ్రిస్బేన్ పోరులో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు వరుస ఓటములతో ఒత్తిడిలో ఉన్న కంగారూలు, సిరీస్‌ను సమం చేయాలనే కసితో బరిలోకి దిగుతున్నారు. వచ్చే ఏడాది స్వదేశంలో జరగబోయే టీ20 ప్రపంచకప్ దృష్ట్యా జట్టులో పలు ప్రయోగాలు కొనసాగిస్తున్న స్కిప్పర్ సూర్యకుమార్ యాదవ్, ఈ మ్యాచ్‌లో కూడా వాటిని కొనసాగించే అవకాశం ఉంది.

బ్యాటింగ్‌లో టీమ్ మొత్తం చక్కగా ఆడుతున్నప్పటికీ, ఇన్నింగ్స్‌ను పెద్ద స్కోర్లుగా మార్చడంలో లోపం కనిపిస్తోంది. గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చిన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మరోసారి కీలకపాత్ర పోషించనున్నాడు. ఇక సూర్యకుమార్ తక్కువ స్కోర్లకే పరిమితమవుతున్న విషయం ఆందోళన కలిగిస్తోంది. అభిషేక్ శర్మ తన దూకుడు కొనసాగించాలని టీమ్ ఆశిస్తోంది. తిలక్ వర్మ (0, 29, 5) ఇప్పటివరకు రాణించలేకపోయాడు. దూబే, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండ్ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు.

బౌలింగ్‌లో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కీలకపాత్ర పోషించనున్నారు. బ్రిస్బేన్ పిచ్ పేసర్లకు అనుకూలంగా ఉండే అవకాశం ఉండటంతో, బుమ్రా%-%అర్ష్‌దీప్ సింగ్ ద్వయం కీలకమవుతుంది. భారత జట్టు గత మ్యాచ్‌లో ఆడిన అదే జట్టుతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది.

ఈ మ్యాచ్‌లో మొత్తం ఒత్తిడి ఆతిథ్య జట్టుపైనే ఉంది. సారథి మిచెల్ మార్ష్ నేతృత్వంలో ఆస్ట్రేలియా టీమ్ అద్భుత విజయాలతో దూసుకెళ్తుండగా, స్వదేశంలో భారత్ జోరుకు బ్రేకులు వేయడం వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది. సిరీస్ నెగ్గే అవకాశం కోల్పోకుండా ఉండేందుకు బ్రిస్బేన్ పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

భారత స్పిన్నర్లే తమ బ్యాటింగ్ ఆర్డర్‌కు తిప్పలు పెడుతున్నారని గుర్తించిన కంగారూలు, వారి వ్యూహాలకు ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

# పరిపాలనను పోల్చి ఓటేయ్యాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ, భవనాలు, మౌలిక వసతులు తదితరాల గురించి ప్రశ్నిస్తే, విచారణ చేయాలని ఆదేశిస్తే... చివరకు ప్రభుత్వాన్ని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ కళాశాలల బంద్ పెట్టాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు తమ ప్రభుత్వం భయపడబోదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఫీజు బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని హామీనిచ్చారు. ఒకవేళ కాదు కూడదూ అంటే.. రాష్ట్రానికి నెలకు వస్తున్న రూ.18 వేల కోట్ల ఆదాయంపై కమిటీ వేసి, ఆ కమిటీలో ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ మాదిగతోపాటు కాలేజీల యాజమాన్యాలను భాగస్వాములను చేస్తామని వ్యాఖ్యానించారు. ఆ డబ్బును ఎలా ఖర్చు పెట్టాలో వారే చెప్పాలంటూ సీఎం చురకలంటించారు.

హైదరాబాద్‌లోని గొలుసుకట్టు చెరువులు, కుంటలను కాపాడుతున్న హైడ్రాపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని సీఎం ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఆ పార్టీ నేత ఎడ్ల సుధాకరరెడ్డి... బతుకమ్మ కుంటను ఆక్రమిస్తే, తమ ప్రభుత్వం, ఆయన చెర నుంచి ఆ చెరువును కాపాడి, పునరుద్ధరించిందని గుర్తు చేశారు. సున్నం చెరువుతోపాటు ఇతర చెరువులు, కుంటలను కాపాడామని తెలిపారు.

# దమ్ముంటే పాలన చూపించి ఓట్లు అడగాలి

**(మొదటి పేజీ తరువాయి)**

గత ప్రభుత్వం భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ సర్కారు హైదరాబాద్ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపింది అన్నారు.

కానీ రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలలో హైదరాబాదు నగరాన్ని పూర్తిగా పతనావస్థకు చేర్చి రియల్ ఎస్టేట్ నుంచి మొదలుకొని ఆటో డ్రైవర్ల వరకు అందరి ఉపాధి అవకాశాల పైన దెబ్బకొట్టి అనేక వర్గాలు ఆత్మహత్యలకు పాల్పడేలా రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల పరిపాలన సాగిందన్నారు. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి అరాచకం చేశారని వేలాదిమంది పేదల ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి పెద్దవాళ్ళ అక్రమాల జోలికి వెళ్లలేదని కేటీఆర్ విమర్శించారు. కేవలం పేదలను లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇళ్లను కూలగొడుతున్న హైడ్రా బుల్డోజర్ పేద వాళ్ళ ఇంటికి బస్తీల జోలికి రావద్దు అంటే 11వ తేదీన జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా మంత్రులు అక్రమంగా నిర్మాణం చేసుకున్న ఫామ్ హౌస్లను ఇళ్లను కేటీఆర్ తన రోడ్డు షోలో అందరికీ అర్థం అయ్యేలా ఎల్ఈడి స్క్రీన్ లపై చూపించారు. హైడ్రా గురించి గొప్పగా చెప్పుకున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే సిగ్గు ఉంటే తన మంత్రుల అడ్డగోలుగా అక్రమంగా కట్టుకున్న ఈ నిర్మాణాలను తొలగించాలని కేటీఆర్ సవాలు చేశారు. హైడ్రా వలన ఒక్కరికి కూడా లాభం జరగలేదని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి నిజాయితీ లేని మాటలు మాట్లాడుతున్నారని%ొ%నేతి బీరకాయలో నెయ్యి అంతా నిజాయితీ రేవంత్ రెడ్డి మాటల్లో ఉంటాయని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే గ్యారంటీలు అమలు చేయకుండా తమకే ఓటు వేశారని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి భావించి హామీలను అమలు చేయడాన్ని ప్రారంభించాలని కేటీఆర్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పుతో తెలంగాణ ప్రజలందరికీ హామీలు అమలు కావాలని ఆ దిశగా కాంగ్రెస్ ను ఓడించి ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రెండేళ్లపాటు రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను పీల్చుకుతింటున్న అరాచకానికి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ కనిపించిన కాంగ్రెస్ ను తరమవలసిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ పార్టీకి స్వర్గీయ ఎన్టీ రామారావు గారి పేరును ఎత్తే నైతిక అర్హత లేదని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా భారీ మెజారిటీతో గెలిచిన ఎన్టీ రామారావుని పదవి నుంచి తొలగించిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని కేటీఆర్ అన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి పెట్టిన ఎన్టీఆర్ పేరును తొలగించి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ పేరు పెట్టిందన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీ రామారావుకు అహంకారం అంటూ ఎన్టీఆర్ ను తూలనాడుతూ రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ గుర్తు చేశారు. తన జీవితమంతా వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ పార్టీ గనుక ఎన్టీ రామారావు విగ్రహాలు పెడితే ఆయన ఆత్మ చూపిస్తుందని కేటీఆర్ అన్నారు.

## 'పెద్ది' నుంచి 'చికిరి చికిరి' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుండి తాజా అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాకు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా, వృద్ధి సినిమాస్ నిర్మాణం చేపట్టింది. ఇందులో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ప్రమోషన్స్‌ను వేగంగా ప్రారంభించిన చిత్రబృందం తాజాగా ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' (%జష్త్రఱఎఱతీఱ%) పాటను విడుదల చేసింది. ప్రపంచప్రసిద్ధ సంగీత దర్శకుడు ఏఆర్. రెహ్మాన్ అందించిన ఈ మెలోడీ ప్రస్తుతం సోషల్ మీడియాలో, యూట్యూబ్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా వైరల్ అవుతోంది. చరణ్ ఎనర్జీ, రెహ్మాన్ ట్యూన్, సుందర visualsప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.







# ఫ్యామిలీ మ్యాన్ 3 ట్రైలర్ విడుదల

- **నవంబర్ 21 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్**

**బలగం టీవీ, ముంబై**

దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్' మూడో సీజన్‌తో ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా నవంబర్ 21 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సీజన్ విడుదల కానుంది.

తాజాగా విడుదలైన 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' ట్రైలర్ సోషల్ మీడియాలో భారీ స్పందనను రాబట్టింది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఇప్పటికే రెండు సీజన్‌లతో రికార్డులు సృష్టించింది. ఇప్పుడీ మూడో సీజన్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి రెండు సీజన్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ అండ్ డీకే ద్వయం ఈసారి కూడా దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. వీరి ప్రత్యేకమైన కథనం, యాక్షన్, హాస్యం సమ్మేళనం ఈ సిరీస్ ప్రత్యేకతగా నిలుస్తుంది.

ఈ సీజన్‌లో 'పాతాళ్ లోక్' నటుడు జైదీప్ అహ్లావత్ ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించబోతున్నట్లు సమాచారం. ఈసారి కథ నార్త్‌ఈస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో నడుస్తుందని, దేశ భద్రత నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ 3 %-% నవంబర్ 21 నుంచి ప్రైమ్ వీడియోలో చూడవచ్చు.

# రాజమౌళి-మహేష్ బాబు కాంబో నుంచి బిగ్ అప్‌డేట్!

**బలగం టీవీ, హైదరాబాద్**




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి మరియు సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) నుంచి భారీ అప్‌డేట్ బయటకు వచ్చింది. అభిమానులు ఈ చిత్రంపై ఆతృతగా ఎదురుచూస్తుండగా, రాజమౌళి టీమ్ సడన్‌గా ఒక బిగ్ ట్రీట్ అందించింది.

నవంబర్ 15న జరగబోయే భారీ ఈవెంట్ 'గ్లోబ్ ట్రాటర్' కు ముందు, చిత్రబృందం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్‌ను నేడు విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆయన 'కుంభ' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. లుక్ ప్రకారం ఆయన విలన్ రోల్‌లో కనిపించే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన భారీ ఈవెంట్ నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరగనుంది. ఇందులో భాగంగా సినిమా టైటిల్‌తో పాటు కథా విశేషాలు

# వీధి కుక్కలపైచర్యలు తీసుకోవాలి

- **బహిరంగ ప్రదేశాల నుంచి షెల్టర్లకు తరలించాలి**
- **సుప్రీం కోర్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**

బహిరంగ ప్రదేశాల్లోని వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటిని విద్యా సంస్థలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రులు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. వీధి కుక్కలు ఆయా ప్రదేశాల్లోకి రాకుండా కంచెలు వేయాలని సూచించింది. ఈ ప్రదేశాల్లో కుక్కలు లేవని నిర్ధారించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని చెప్పింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్నచోటే వదిలివేయొద్దని ఆదేశించింది. కుక్కల తరలింపునకు కోర్టు ఎనిమిది వారాల సమయం ఇచ్చింది. వీధి కుక్కల కేసులో శుక్రవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు న్యాయమూ ర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. రహదారులపైకి కుక్కలు, పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని వివరించింది. జాతీయ రహదారులపై తిరుగు తున్న పశువులను షెల్టర్లకు తరలించాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు, హైవే గస్తీ బృందాలకు ఆదేశాలు ఇచ్చింది. రెండు వారాల్లోగా మున్సిప ల్ సిబ్బంది వీధి కుక్కలు ఉండే స్థలాలను, భవనాలను గుర్తించాలని సూచించింది. ఆయా ప్రాంతాల్లో తిరిగే వీధి కుక్కలను స్టెరిలైజేషన్ చేసి, రీ లొకేషన్ చేయాలని స్పష్టం చేసింది. అమికస్ క్యూరీ నివేదికలో పేర్కొన్న విషయాలు కోర్టు ఆదేశాల్లో భాగంగా పరిగణించబడతాయని సుప్రీంకోర్టు వివరించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నివేదికలో గుర్తించిన లోపాలను సరిచేయడానికి తీసుకున్న చర్యల వివరాలతో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. అలాగే రాజస్తాన్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. అన్ని రాష్ట్రాల నోడల్ అధికారులకు జాతీయ రహదారులు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల మీద కనిపించే నిరాశ్రయ జంతువులను తొలగించాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమం కోసం జాయింట్ కోఆర్డినేటెడ్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించింది. రహదారుల నుంచి తరలించిన పశువులు, కుక్కలకు అవసరమైన సంరక్షణ అందించాలని తెలిపింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఆదేశాల అమలుపై కచ్చితమైన బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే సంబంధిత అధికారులపై వ్యక్తిగత చర్యలు తీసుకోబడుతాయని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఎనిమిది వారాల్లోగా అమలు విధానం, చర్యలపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.